# అనుమతి ఉండదు అడిగే వారుండరు

## టౌన్ ప్లానింగ్ ద్వంద్వ వైఖరి



**టీ మీడియా,జూన్ 11,గోదావరిఖని :** ఇక్కడ అనుమతులు ఉండవు... అడిగేవారు అంతకంటే ఉండరు ఇంకేముంది.. ఇటేటు రమ్మంటే ఇల్లంత నాదే అన్నట్టు గోదావరిఖని నడిబొడ్డున అక్రమ నిర్మాణాలు చూస్తుండగానే ఒక్కొక్కటిగా వెలుస్తున్నాయని పలువురు వాపోతున్నారు. గతంలో స్థానిక ప్రధాన చౌరస్తా అటువైపు సింగరేణి క్వార్టర్లను అనుకొని ఉన్న దుకాణాలను అభివృద్ధి పేరుతో కూల్చివేశారు. అక్కడ దుకాణాలు కోల్పోయిన వారికి ఇటువైపు పోచమ్మ మైదానంలో ఖాళీగా ఉన్న స్థలంలో అప్పటికప్పుడే ఆరు షెట్టర్ల వరకు తాత్కాలికంగా నిర్మించి ఇచ్చారు. ఇక్కడి వరకు న్యాయంగానే ఉంది. కానీ ఇప్పుడక్కడ ఊడల మర్రిలా రోజు రోజుకూ విస్తరిస్తూ ఒక్కొక్కటిగా నిర్మాణాలు వెలుస్తుండటం అన్యాయంగా ఉందని ఆరోపణలు వస్తున్నాయి.ఆ బ్యారెక్ లోని ఓ దుకాణం యజమాని ఇది చాల దన్నట్టుగా ఆ దుకాణం వెనుకాల స్థలంను సైతం ఆక్రమించి మరో నిర్మాణం చేపడుతున్నారు. కార్పొరేషన్ నుంచి ఏలాంటి అనుమతులు ఉండవు. కానీ ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఎందుకంటే టౌన్ ప్లానింగ్ విభాగం పగ్గాలు ఓ రాజకీయ నాయకుడి చేతిలో ఉండటమే కారణమని చర్చించుకుంటున్నారు. కాగా, ఇందులో ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన ఓ వ్యక్తికి సైతం షాపు నిర్మించి ఇచ్చినట్లు సమాచారం. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా అన్నట్టు%ొ% గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో రోజు రోజుకు అక్రమ నిర్మాణాలకు హద్దు లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు.వీటిలో ఓ రైస్ డిపో దుకాణం వెనుకాల గుట్టు చప్పుడు గాకుండా అదనపు గదుల నిర్మాణం జరుగుతుంది. రామగుండం కార్పొరేషన్లో ఉన్నోళ్లకు ఒక నీతి లేనోళ్లకు మరో రీతా అన్నట్టు అధికారుల వ్యవహార శైలి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన వ్యాపార కూడలి లక్ష్మీనగర్లో లో మొబైల్ దుకాణాలు కోల్పోయి చాలా మంది వ్యాపారులు వీధిన పడిన పరిస్థితి ఉంది. వారికి ఇప్పటివరకు ఎక్కడ కూడా ప్రత్యమ్నాయం చూపించలేదని ఆవేదన చెందుతున్నారు.అక్రమ నిర్మాణాల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వంద్వ వైఖరి అవలంభించడం కార్పొరేషనక్కు ఇంకా అపవాదు తెచ్చిపెడుతుంది. ఏదిఏమైనా నగర పాలక ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని టౌన్ ప్లానింగ్ను గాడిలో పెట్టి అక్రమ అడ్డుకట్ట వేయాలని ఉందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు

# భద్రత చర్యలపై తనిఖీ చేసిన ఎసిపి

## సమస్య ఉంటే పోలీసులకు తెలియచేయాలి



**టీ మీడియా,జూన్ 11,గోదావరిఖని :** రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోదావరిఖని ప్రభుత్వ హాస్పిటల్, సింగరేణి ఏరియా హాస్పిటల్ లో భద్రత చర్యలలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు, పనితీరు,భద్రత సిబ్బంది పనితీరు హాస్పిటల్ ల లోని వార్డ్స్,పరిసరాలను బుధవారం గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్,గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తో కలిసి సందర్శించి,పరిసరాలను పరిశీలించి భద్రతా చర్యలపై పలు సూచనలు సలహాలు ఇవ్వడం,భద్రత, ఇటీవల ఆసుపత్రి సిబ్బందిపై దాడి జరిగిన సంఘటనల గురించి రాష్ట్రంలోని వివిధ ప్రదేశాలలో ఆసుపత్రుల నుండి పిల్లల కిడ్నాప్ ల గురించి మొదలైన విషయాలపై చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా ఏసీపి హాస్పిటల్ అధికారులతో సూపరడెంట్స్ తో మాట్లాడుతూ... ప్రభుత్వ, సింగరేణి ఆసుపత్రికి వివిధ ఆరోగ్య సమస్యలతో ఇతర కారణాలతో చాలామంది వస్తుంటారు.అదేవిదంగా కొంతమంది అనుమానస్పదంగా హాస్పిటల్ ప్రాంతం లలో తిరుగుతుంటారు.గతంలో కొన్ని సందర్భాల్లో పిల్లలను అపహరించడం, చికిత్స జరుగుతున్న సమయంలో ఎవరైనా మరణించిన సందర్భాలలో బంధువులు



కుటుంబ సభ్యులు దాడులకు పాల్పడే అవకాశం ఉంటుంది.ముందస్తు భద్రత, రక్షణ లో భాగంగా ఆస్పత్రి తప్పనిసరిగా సిసి ఎంట్రన్స్,ఎగ్జిట్ మెయిన్ రోడ్లపై,ఆస్పత్రి ఎంట్రెన్స్ వద్ద అదేవిదంగా ఎమర్జెన్సీ వార్డ్, చిల్డ్రన్ వార్డ్, మెటర్నటీ వార్డ్, క్యాజువల్ వార్డ్ లలో, వార్డ్స్ ఎంట్రెన్స్, ఎగ్జిట్ ప్రాంతాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలు పనితీరు ను ఎప్పటికప్పుడు చూడాలి. పని చేయని వాటిని మెయింటైన్స్ చెక్ చేసి పనిచేసే విధంగా చూడాలని సూచించారు.హాస్పిటల్ లో అన్ని ప్రాంతాలు పూర్తి స్థాయిలో కవర్ అయ్యే విధంగా నిఘా నీడలో ఉండే విధంగా హై రెజల్యూషన్ కలిగిన కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని,వాటి పనితీరుపై పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉండాలని సూచించారు.హాస్పటల్ సెక్యూరిటీ సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు హాస్పటల్ పరిసరాలలో జరిగిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో హాస్పిటల్ ల ఆర్ఎంఓ లు,సూపరిండెంట్స్, హాస్పిటల్ సిబ్బంది ఉన్నారు.



## కనుల పండువగా ఏరువాక పౌర్ణమి

**టీ మీడియా,జూన్ 11మక్త ల్/ ఊట్కూర్ :** ఏరువాక పౌర్ణమిపురస్కరించుకొని మక్తల్, ఊట్కూర్ మండలాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను అంగరంగ వైభవంగా కనుల పండువగా నిర్వహించారు. మృగశిర కార్తి ప్రారంభం సమయంలో వచ్చే ఏరువాక పౌర్ణమికి రైతన్నలు వ్యవసాయానికి కేంద్ర బిందువులుగా ఉపయోగపడే కాడెద్దులను శుభ్రం చేసి, రంగులతో అలంకరించి పూజలు నిర్వహించారు.మక్తల్ మున్సిపాలిటీలో వేణుగోపాల స్వామి దేవాలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎద్దులను పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయం ప్రాంగణం ఎదుట రైతుల కొలహాల మధ్య ఏర్కతాడు తెంపే కార్యక్రమం రెండున్నర గంటల పాటు కొనసాగింది. పలు గ్రామాల్లో ఎద్దుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వెంకటేశ్వర స్వామి దేవాలయంలోహెూమాలు

**టీ మీడియా,జూన్ 11,బిజినేపల్లి :** జ్యేష్ఠ మాస పౌర్ణమి సందర్భంగా బుధవారం మండల పరిధిలోని వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలోహెూమం, కలశాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. మట్పూరి నాగేశ్వర్, విజయ్ కుమార్ కైంకర్యంతో యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీమన్నారాయణాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం శాస్త్రోక్తంగా హెూమాలను నిర్వహించారు.అంతకుముందు ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీర్థ ప్రసాదాలు ,అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్ రెడ్డి, కొర్త చంద్రారెడ్డి, గుబ్బ సత్యనారాయణ, దెంది కృష్ణా రెడ్డి, జక్కా రెడ్డి, చెన్నకృష్ణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యమ కళాకారుల హామీలు నెరవేర్చాలి

-రాజన్న సన్నిధానంలో పూజలు

**టీ మీడియా,జూన్ 11,వేములవాడ:** ఉద్యమ కళాకారుల హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ బుధవారం వేములవాడ రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పక్షాన దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న సన్నిధిలో ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి కళాకారుల హామీలు సత్వరమే పరిష్కరణ చేసే విధంగా చూడాలని రాజన్నను వేడుకున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 14,15 తేదీలలో జరుగనున్న మహా చండీయాగం కరీంనగర్ తపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయముకు 33 జిల్లాల కళాకారుల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి, ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు, ఉద్యమ కళాకారుల జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ, డాన్స్ మాస్టర్ గంగ శ్రీకాంత్, కళాకారులు మిద్దె వినీత్, వెదిరే రవి,మామిండ్ల సత్తయ్య, ఎర్ర రవిరాజు,బండ రాయమల్లు తదితర కళాకారులు పాల్గొన్నారు.

## సమతుల్యమైన ఆహారాన్నివిద్యార్థులకు

-మండల విద్యాధికారిని పావని



**టీ మీడియా,జూన్ 11,చిగురుమామిడి:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సమతులమైన ఆహారాన్ని అందించాలని మండల విద్యాధికారి వి. పావని అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు, కస్తూరిభా గాంధీ పాఠశాలలో శానిటేషన్ వర్కర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనాన్ని ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులకు తగు సూచనలు ఇవ్వాలన్నారు.విద్యార్థులలో శారీరక, మానసిక వికాసానికి సమతుల ఆహారం అత్యవసరమని, దీంతోపాటు విద్యార్థులలో ఏకాగ్రత పెంపొందించడానికి పరిశుభ్రమైన పోషకాహారం తోడ్పడుతుందని పేర్కొన్నారు. పాఠశాల పరిశుభ్రతలో సానిటేషన్ వర్కర్లు చేయవలసినటువంటి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రబియా బస్రి, జిల్లా రిసోర్స్ పర్సన్ లక్ష్మణ్ రావు, మండల రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్, ఎంఆర్పి పర్యవేక్షకులు బొడ్డు తిరుపతి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

### ఈఈ నూనె శ్రీధర్ ఇళ్లల్లో

# ఏసీబీ సోదాలు

- రాష్ట్ర వ్యాప్తంగా 12 చోట్ల తనిఖీలు..
- కరీంనగర్లో శ్రీధర్ అరెస్టు..?



**టీ మీడియా, జూన్ 11, హైదరాబాద్ :** ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ ఇళ్లలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నది. ఇరిగేషన్ సీఏడీ డివిజన్ 8లో నూనె శ్రీధర్ విధులు నిర్వర్తిస్తున్నారు. చొప్పదండిలోని ఎస్సారెస్పీ క్యాంపు కార్యాలయంలో శ్రీధర్ పని చేస్తున్నారు. ఇక ఆయనకు సంబంధించి 12 చోట్ల ఏసీబీ సోదాలు జరుగుతున్నాయి. ఇరిగేషన్ శాఖలో ప్రాజెక్టులు కట్టబెట్టి వందల కోట్లు సంపాదించారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో హైదరాబాద్ సహా, కరీంనగర్, బెంగళూరులో సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. బెంగళూరులో నాలుగు చోట్ల, హైదరాబాదులో ఆరు చోట్ల తనిఖీలు జరుగుతున్నాయి. శ్రీధర్ కు సంబంధించిన బంధుమిత్రులు, కుమారుడుతో పాటు తన సన్నిహితుల ఇళ్లలో సోదాలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కరీంనగర్ లో శ్రీధర్ ను అదుపులో తీసుకొన్న ఏసీబీ హైదరాబాద్ తీసుకొస్తున్నట్లు సమాచారం.

## అధికారులను సస్పెండ్ చేయాలి




**టీ మీడియా, జూన్ 11, ఖిలావరంగల్:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో గత వారం రోజులుగా చెరువు మట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అవినీతి కాంట్రాక్టర్లకు అనుమతి ఇచ్చిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చెరిపల్లి ఆనంద్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు ఫిర్యాదు చేశారు. కాట్రపల్లి గ్రామానికి చెందిన గిరుక సురేష్ అనే వ్యక్తి పేరుతో డీడీలు తీసీ రైతుల పంట పొలాల్లో పోయాల్సిన మట్టిని కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి గ్రామంలోని ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చెలామణి అవుతున్న సురేష్నాయక్ మట్టిని విక్రయించి లక్షల్లో డబ్బులు సంపాదిస్తున్నారని, అనుమతి ఇచ్చిన తహసీల్దార్, మైనర్ ఇరిగేషన్ అధికారులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో విముక్త చిరుతల పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నల రవికుమార్, కార్యదర్శి చేతరాజు సుమన్బాబు తదితరులున్నారు.

## నెరవేరిన సొంత ఇంటి కల


ఒకేరోజు 1913 ఇందిరమ్మ పట్టాల పంపిణి



**టీ మీడియా, జూన్ 11, వనపర్తి బ్యూరో :** ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం. గత పదివేల పాలనలో దగాపడ్డ నిరుపేదలు. ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణలోని నిరుపేద కుటుంబాలకు నేడు సొంత ఇంటి కల నెరవేరిందని ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి వారికి వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలుస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.బుధవారం వనపర్తి నియోజకవర్గ పరిధిలోని అడ్డాకుల మండలంలోని కన్మనూర్, బలీద్ పల్లి, చిన్న మునగాల్చేడ్, పెద్ద మునగాల్చేడ్, గ్రామాలతో పాటు పెద్దమందడి మండల పరిధిలోని వెల్టూర్, చిలక టోన్ పల్లి గ్రామ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, వనపర్తి మునిసిపాలిటీ, వనపర్తి మండలం, గోపాల్పేట మండలం, రేవల్లి మండలం, ఏదుల మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వనపర్తి శాసనసభ్యులు గౌరవ తూడి మేఘారెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయా మండలాలలో ఏర్పాటుచేసిన సమావేశాల్లో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు.బుధవారం ఒకేరోజు 1913 ఇండ్లకు గాను దాదాపు 96 కోట్ల 65 లక్షల రూపాయలు పిలువగల ఇందిరమ్మ ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేశామని ఎమ్మెల్యే చెప్పారు,ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వఈ కార్యక్రమంలో ఆయా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఇందిరమ్మ లబ్ధిదారులు మహిళలు యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణలో ఐదురోజులు భారీ వర్షాలు..

రెండు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ..!



**టీ మీడియా, జూన్ 11, హైదరాబాద్:** ఐదురోజుల భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. పలుచోట్ల ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్టను జారీ చేసింది. అలాగే, శని, ఆదివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది.

### ఆటో డ్రైవర్లు ట్రాఫిక్

# నిబంధనలు పాటించాలి

- మద్యం సేవించి డిపితే జైలు శిక్ష
- ఖాకి చొక్కా ధరించాలి
- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్




**టీ మీడియా, జూన్ 11, వనపర్తి బ్యూరో :** ప్రయాణికులను, విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు, ఆటోలను నడిపే సమయంలో తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఎల్ వి, గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లకు వనపర్తి సీఐ, కృష్ణయ్య, ట్రాఫిక్ ఎస్సై, సురేందర్ వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అప్పుడే ప్రమాదాల సంఖ్యను తగ్గించ గలుగుతామని ప్రజలు, వాహనదారులకు ట్రాఫిక్ సిగ్నల్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి ఆటోలను నడపడం, నిర్లక్ష్యంగా రోడ్లపై ఇష్టానుసారంగా ఆటోలను నిలిపివేసి, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. డ్రైవర్ సీటు వెనక భాగంలో డ్రైవర్ పేరు, ఫోన్ నెంబరును ప్రయాణికులకు కనిపించే విధంగా కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణంలో కొన్ని రోజులుగా జరుగుతున్నా దొంగతనాల విషయంలో కూడా డ్రైవర్ల అప్రమత్తంగా అనుమానం ఉన్న వ్యక్తులపై కూడా ఏదైనా సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియ జేశారు.ఆటోలను అతివేగంగా నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. తమ వెనుక కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారని గుర్తుపెట్టుకుని ఆటోలు సురక్షితంగా నడుపుకోవాలన్నారు. లైసెన్సులు, ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండేలా తీసుకోవాలన్నారు. తాగి వాహనాలు నడపవద్దని. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని, ఆటో రిజిస్ట్రేషన్ నెంబర్ కనబడేలా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అప్పుడే ప్రమాదాల సంఖ్యను తగ్గించ గలుగుతామని ప్రజలు, వాహనదారులకు ట్రాఫిక్ సిగ్నల్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో . వనపర్తి సీఐ, కృష్ణయ్య, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై, సురేందర్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది , ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



## వార్డుల పునర్వ్యవస్థీకరణ పరిశీలన

**టీ మీడియా,జూన్ 11,గోదావరిఖని :** రామగుండం నగర పాలక సంస్థ అరవై డివిజన్లు గా విభజించిన నేపధ్యంలో వార్డుల పునర్వ్యవస్థీకరణ జరుగుతున్న తీరును పురపాలక ప్రాంతీయ సంచాలకులు ( వరంగల్ ) షాహిద్ మసూద్ పరిశీలించారు.రామగుండం నగర పాలక సంస్థ వార్డుల విభజన ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న ఆయన బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించి అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ఎసి) అరుణశ్రీ తో భేటీ అయ్యారు.వార్డుల విభజనకు సంబందించి ప్రజల నుండి వస్తున్న సలహాలు,సూచనలు, ఆక్షేపణల గురించి అడిగి తెలుసుకున్నారు.డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి,పట్టణ ప్రణాళికా విభాగం,రెవెన్యూ విభాగం అధికారులతో సమావేశమై వార్డుల విభజన ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. పట్టణ ప్రణాళికా విభాగం రూపొందించిన డివిజన్ మ్యాపులను పరిశీలించారు.ఆ తరువాత వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో చేపడుతున్న కార్యకలాపాలను సమీక్షించారు.మూడవ డివిజన్ లో వంద రోజుల ప్రణాళిక అమలు తీరును పరిశీలించారు.ఈ సంధర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్,పట్టణ ప్రణాళికాధికారి నవీన్, రెవెన్యూ ఆఫీసర్ ఆంజనేయులు,రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు శంకర్ రావు, ఖాజా సానిటరీ ఇన్స్పెక్టర్లు కుమార స్వామి, కిరణ్ ,తదితరులు పాల్గొన్నారు.కాగా వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా కాలువల్లో పూడిక తొలగింపు పనులతో పాటు త్రాగు నీటి స్వచ్ఛత గుర్తించడానికి బుధవారం వివిధ చోట్ల క్లోరిన్ పరీక్షలు నిర్వహి%శీ%చారు.ఎన్టిపిసి న్యూ పోరట్ పల్లి నుండి ర్యాలీ గా బయలు దేరి మేడిపల్లి సెంటర్ వరకు వార్డు అధికారులు, సానిటరీ జవాన్లు,స్వశక్తి మహిళలు తడి చెత్త,పొడి చెత్త వేరు చేసే ప్రక్రియతో పాటు కుక్కల నుండి రక్షణ పొందడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై కరపత్రాలతో ఇంటింటా అవగాహన కల్పించారు.మానవ హారం గా ఏర్పడి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.అన%శీ%తరం గౌతమి నగర్ వారాంతపు సంతలో డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో వీధి వ్యాపారుల సంక్షేమం గురించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి మెప్మా సిబ్బంది వివరించారు.పిఎం స్వనిధి పథకం ద్వారా సబ్సిడీ రుణం పొంది వ్యాపారం మెరుగుపరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు అధికారి రమేష్,కమ్యూనిటి ఆర్గనైజర్లు ఊర్మిళ,శ్వేత,ప్రియదర్శిని, సానిటరీ జవాన్ సంపత్,ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్,ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు శుభాకాంక్షలు



టిపిసిసి ప్రధాన కార్యదర్శి దొడ్డ బాలాజీ

**టీ మీడియా, జూన్ 11, మంథని:** ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్ తినిపించి. అధ్యక్షులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుదిల్ల శ్రీధర్ బాబు సోదరులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు.

# కమిషన్ ధర్మంగా ఉంటే
# ఇదో లొట్టపీసు

## -బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



: టీ మీడియా, జూన్ 11, హైదరాబాద్బ్యూరో :కాళేశ్వరం కమిషన్ ధర్మంగా పనిచేస్తే ఇది లొట్టపీసు కేసు అని పక్కన పెడుతుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎన్డీఎస్ఏ నివేదిక బీజేపీ ఆఫీసులో తయారైందన్న కేటీఆర్ ప్రస్తుతం నివేదికలు ఎలా కావాలంటే అలా అని ఆరోపించారు. కాళేశ్వరం కమిషన్ విచారణ కేవలం రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నారని విమర్శించారు.

### ఆరు గ్యారంటీలు ఏమైనవి

2014లో ఆనాడు తెలంగాణ రాష్ట్రం ఒక దుర్భిక్ష, కరవు ప్రాంతంగా ఉండేదని కేటీఆర్ గుర్తుచేశారు. వరి ఉత్పత్తిలో 14వ స్థానంలో ఉన్న రాష్ట్రం, కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక 2023 నాటికి పంజాబ్, హరియాణాలను తలదన్ని అగ్రభాగానికి చేరుకుందన్నారు. తెలంగాణ తెచ్చింది కేసీఆర్, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసింది కాళేశ్వరం అనేది చరిత్ర దాచలేని సత్యమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎన్ని కేసులు వేసి కుట్రలు చేసే ప్రయత్నం చేసినా భయపడమన్నారు. రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన నాలుగు వందల ఇరవై హామీలు, ఆరు గ్యారంటీలు ఏమైనవి అని అడుగుతూనే ఉంటానన్నారు.

### రాజకీయంగా వేధించే ప్రయత్నం

ఎస్ఎల్బీసీ టన్నెల్ కూలిపోయి 8 మంది కార్మికులు చనిపోతే ఏదన్నా గవర్నమెంట్ ఏజెన్సీ వచ్చి ఇక్కడ ఏమైందని విచారణకు కూర్చోపెట్టిందా అని కేటీఆర్ అన్నారు. పెద్దవాగు రెండుసార్లు కొట్టుకుపోయిందని, సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే మాత్రం ఎవరూ ప్రశ్నించలేదన్నారు. ఏ ఒక్కరికీ ఏమీ కాని కాళేశ్వరంలో, 45 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఒకాయన అంటే జరిగింది, జరిగింది అని మరొకాయన అంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది రాజకీయంగా వేధించే ఒక ప్రయత్నం తప్ప, దీని వల్ల తమకు ఒరిగేది ఏముండదని అన్నారు. 420 హామీలిచ్చి గద్దెనెక్కి ఒక్కహామీ అమలు చేయకుండా పదిహేను పదహారు నెలలు టైమ్ పాస్ చేశారని కేటీఆర్ విమర్శించారు. చివరికి క్యాబినెట్ విస్తరణకు కూడా పదిహేను పదహారు నెలల సమయం తీసుకున్న అసమర్థ ప్రభుత్వం, అసమర్థ ముఖ్యమంత్రి ఆడుతున్న నాటకం తప్ప ఇంకా మరేమీ కాదని కేటీఆర్ మండిపడ్డారు.

# గంజాయి వివాదంలో సింగర్ మంగ్లీ

## -కేసు నమోదు చేసిన పోలీసులు



టీ మీడియా, జూన్ 11, హైదరాబాద్:ప్రముఖ సింగర్ మంగ్లీ పుట్టి రోజు వేడుకల్లో గంజాయి కలకలం రేగింది. ఈ వేడుక ల్లో భారీగా గంజాయి, విదేశీ మద్యాన్నిపోలీసులు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ పార్టీకి హాజరైన పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించగా డ్రగ్స్ పాజిటివ్‌గా తేలినట్లు సమాచారం.సింగర్ మంగ్లీ పుట్టినరోజు వేడుకలు జూన్ 10 పదవ తేదీ మంగళవారం నిర్వహించగా.. అదే మంగళవారం సాయంత్రం ఆమె చేవెళ్లలోని త్రిపుర రిసార్టులో బర్త్ డే పార్టీని ఇచ్చింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సినీ ఇండస్ట్రీకి చెందిన వారు మొత్తం 48 మంది వరకు ఈ పార్టీకి హాజరు అయ్యారని తెలుస్తోంది. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఈ రిసార్టు పై అర్ధరాత్రి రెండు గంటల తరువాత ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 48 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా 9 మందికి పాజిటివ్ నిర్ధరణ అయింది. దీంతో ఎన్డీపీఎస్ యాక్ట్, సౌండ్ పొల్యూషన్ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.గంజాయి తీసుకుంటూ దామోదర్ అనే వ్యక్తి పట్టుబడినట్లుగా తెలుస్తోంది. అనుమతి లేకుండా బర్త్ డే పార్టీని నిర్వహించడం...దీంతోపాటు గంజాయి, విదేశీ మద్యం, దొరకడంతో ఫోక్ సింగర్ మంగ్లీ, త్రిపురా రిసార్ట్ జీఎం శివరామకృష్ణ ల పై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా డీజేప్లే చేసినందుకు డిజెను పోలీసులు సీజ్ చేశారు.

# నేడు తల్లికి వందనం నిధులు విడుదల

## సూపర్ సిక్స్‌లో మరో హామీకి పచ్చజెండా




టీ మీడియా, జూన్ 11, అమరావతి బ్యూరో : సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన హామీకి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా గురువారం నాడు తల్లికి వందనం నిధుల విడుదలకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదును సర్కార్ జమ చేయనుంది. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయించారు.67,27,164 మంది విద్యార్థులకు ఈ పథకం వర్తింపు చేయనుంది. ఈ మేరకు రూ.8,745 కోట్లను ప్రభుత్వం గురువారం నాడు తల్లుల ఖాతాలో జమ చేయనుంది. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్?లో చేరిన విద్యార్థులకు కూడా తల్లికి వందనం అమలు చేయనుంది. అడ్మిషన్లు పూర్తై డేటా అందుబాటులోకి రాగానే వారి తల్లుల ఖాతాల్లో నిధులను జమ చేయనున్నారు. ఈ మేరకు విధి విధానాలను ఖరారు చేస్తూ నేడు జీవో విడుదల చేయనున్నారు. సచివాలయంలో మంత్రి నారా లోకేశ్?తో కలిసి సమీక్ష నిర్వహించిన సీఎం ఈ మేర కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మరోవైపు సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న వారందరూ దీనికి అర్హులు. ప్రతి విద్యార్థికి ఏటా రూ.15,000లు అందించనుంది. ఓ కుటుంబంలో ఎందరు పిల్లలున్నా, అందరికీ పథకం వర్తిస్తుంది. తద్వారా విద్యార్థులకు ఆర్థిక భరోసా లభించనుంది.

### తల్లులకు అభినందనలు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా తల్లికి వందనం అమలుకు శ్రీకారం చుట్టామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తల్లులకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. బడికి వెళ్లే పిల్లలందరికీ తల్లికి వందనం అందుతుందని చెప్పారు. ఇప్పటికే అన్న క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, దీపం-2 అమలు చేశామని లోకేశ్ వివరించారు.



# ప్రభుత్వ స్కూళ్లలో

- నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు

టీ మీడియా, జూన్ 11, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో ఒకటో తరగతి నుంచి చదువుకునే అవకాశం ఉండగా ప్రైవేట్ స్కూళ్లలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నడుస్తున్నాయి. చిన్నారులకు 3 ఏళ్లు నిండగానే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని, దానివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని భావిస్తున్న తెలంగాణ ప్రభుత్వం ప్రైమరీ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 210 పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. 2025-26 అకాడమిక్ ఇయర్‌కు సంబంధించి నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల్లో విద్యార్థులను చేర్చుకోవాలని డీఈవోలకు సూచించింది.




# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

## ౹జంట గ్రామాల కమిటీలను ఎంపిక

టీ మీడియా, జూన్ 11, వనపర్తి బ్యూరో : మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బలిజపల్లి జంగమయ్యపల్లి జంట గ్రామాల గ్రామంలో మాదిగ ప్రజలతో సమావేశ మైన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ.జూలై 7న ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని జంట గ్రామాల మాదిగలు తీర్మానం చేశారు.ఈ సమావేశాన్ని ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు పాతకోట దండోరా మన్యం మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ విచ్చేస రు .ఈ కార్యక్రమంలో జంగమయ్య పల్లి గ్రామ అధ్యక్షులు వీరపాగ కరుణాకర్ మాదిగ ఉపాధ్యక్షులు : వి.పాష మాదిగ,ప్రధాన కార్యదర్శి: వీరపాగ శ్రీనివాసులు మాదిగ,కార్యవర్గ సభ్యులు శాంతమ్మ,సుధాకర్, బుచ్చయ్య, మద్దిలేటి, గౌరవాధ్యక్షులు దండోరా మన్యం, సత్యం,బుచ్చన్న, రాముల, వెంకటయ్య, కొములయ్య,వీరపాగ గిరమ్మ, మాజీ ఎంపిటిసి సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

### బలిజపల్లి గ్రామ కమిటీ

అధ్యక్షులు కొమ్ము వెంకటేష్ ఉపాధ్యక్షులు: పానుగంటి రాజు, ప్రధాన కార్యదర్శి: గట్టు భాస్కర్,కార్యవర్గ సభ్యులు శరత్ కుమార్, రామాంజనేయులు ,గట్టు చింటూ గౌరవ అధ్యక్షులు పానుగంటి రాములు,గట్టు నాగేష్, మాజీ ఉప సర్పంచ్,గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ అథంటికేషన్‌తోనే తత్కాల్ బుకింగ్

## - రైల్వే శాఖ నిర్ణయం




టీ మీడియా, జూన్ 11, ఢిల్లీ బ్యూరో : రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్. ఇకపై తత్కాల్ టికెట్ బుకింగ్ మరింత ఈజీ కానుంది. జూలై 1 నుంచి ఆధార్ అథంటికేషన్ కలిగిన యూజర్లు మాత్రమే తత్కాల్ టికెట్లు బుకింగ్ చేసుకునేలా రైల్వే మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తత్కాల్ టికెట్ల ప్రయోజనాల్ని నిజమైన వినియోగదారులకు మాత్రమే అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది.2025 జూలై 1 నుంచి ఆధార్ అథంటికేషన్? కలిగిన యూజర్లు మాత్రమే తత్కాల్ టికెట్లు బుకింగ్ చేసుకోగలుగుతారు. ఇందుకోసం వారు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ వెబ్‌సైట్/యాప్‌లను ఉపయోగించుకోవచ్చు" అని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది.

### ఓటీపీ తప్పనిసరి

2025 జూలై 15 నుంచి తత్కాల్ టికెట్ల బుకింగ్ కోసం ఆధార్ ఆధారిత ఓటీపీ అథంటికేషన్ కూడా తప్పనిసరి అని రైల్వే మంత్రిత్వశాఖ పేర్కొంది.

### ఏజెంట్లకు నో ఛాన్స్?!

తత్కాల్ బుకింగ్ విండో ఓపెన్ అయిన మొదటి 30 నిమిషాల వరకు రైల్వే అధీకృత ఏజెంట్లు తత్కాల్ టికెట్లు బుకింగ్ చేయకుండా రైల్వే మంత్రిత్వ శాఖ పరిమితి విధించింది. ముఖ్యంగా ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు ఎయిర్ కండిషన్డ్ తరగతులకు, ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు నాన్‌ఎయిర్ కండిషన్డ్ తరగతులకు ఏజెంట్లు తత్కాల్ టికెట్లు బుకింగ్ చేయకుండా ఆంక్షలు విధించింది.ఈ కొత్త వ్యవస్థకు అవసరమైన మార్పులు చేయాలని, ఈ మార్పులను అన్ని జోనల్ రైల్వేలకు తెలియజేయాలని రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌సెంటర్ లను రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశించింది. అంతేకాదు ఈ నూతన మార్పుల గురించి సాధారణ ప్రజలకు తెలియజేసేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాల ద్వారా విస్తృతంగా ప్రచారంచేయాలని సర్క్యులర్ లో పేర్కొంది.

# ప్రభుత్వ పాఠశాలలలో ఉజ్వల భవిష్యత్

## ౹పలుస శంకర్ గౌడ్ ప్రధానోపాధ్యాయుడు




టీ మీడియా, జూన్ 11, వనపర్తి బ్యూరో :బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాపర్ల ప్రధానోపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్, ఉపాధ్యాయులు మియాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. బడి ఈడు గల పిల్లలందరూ తప్పనిసరిగా ప్రభుత్వ బడిలోనే చదవాలని ప్రభుత్వ బడులలో స్టూడెంట్స్ కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది అన్నారు. ఉచిత విద్య, నాణ్యమైన విద్య, ఉచిత దుస్తులు రెండు జతలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోటు పుస్తకాలు, వారంలో మూడుసార్లు గుడ్డుతో సన్న బియ్యంతో ఉచిత మధ్యాహ్నం భోజన పథకం, ప్యానెల్ డిజిటల్ క్లాసులు, ఉన్నత విద్యార్హతలు అనుభవం గల ఉపాధ్యాయులచే బోధన, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతినెల సమీక్ష సమావేశాలు, విద్యార్థులకు సైన్స్ ల్యాబ్ గ్రంథాలయ సౌకర్యం , మొదలగు మౌలిక వసతులను కల్పించడం జరుగుతు న్నందున ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని తెలియజేయడం జరిగింది. అన్నీ వసతులతో అందుబట్లో ప్రభుత్వ పాఠశాల ఉండగా ప్రైవేట్ పాఠశాల ఎందుకు అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహినోద్దీన్, వెంకటేశ్వర్లు, బాలమ్మ, ఈశ్వర్ రెడ్డి, ఇందిరమ్మ, రమేష్, ఆంజనేయులు , పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు స్వరాజ్యం బాబురెడ్డి , శివాని మరియు గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్మిక ,ప్రజా సమస్యలే ఎజెండా

## -సిపిఎం రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మి




టీ మీడియా ,జూన్ 11,మహబూబ్ నగర్:బుధవారం రోజు సిపిఎం క్యాడర్ క్లాసులలో భాగంగా జరిగిన మీటింగ్లో సిపిఎం రాష్ట్ర నాయకురాలు జిల్లా ఇన్చార్జి జయలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్య పెట్టే విధానాలు చేస్తున్నాయని నిరుద్యోగము, ఆకలి, దరిద్రము ఒకవైపు పెరుగుతున్నదని. రెండో వైపున కేంద్రము మోడీ నాయకత్వంలో 11 సంవత్సరాల పాలన స్వర్ణ యుగమని చెప్పడాన్ని ఆమె తీవ్రంగా దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు రైతులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్లు తెచ్చి పని గంటలు పెంచడం, జీతాలు తగ్గించడము, ఉద్యోగ భద్రత లేకపోవడం, శ్రమను దోచుకోండని పెట్టుబడుదారులకు చట్టాలను మార్చి దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే సమ్మెకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నదని. రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ఆర్థిక పరిస్థితి బాగాలేదు అని ప్రజలకు చెప్పడం భావ్యం కాదని, వాగ్దానాలు ఇచ్చినప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఆర్థిక పరిస్థితి తెలవదా అని ఆమె ప్రశ్నించారు. ఇచ్చిన వాగ్దానాల అమలు చేయాలని సిపిఎం పార్టీ పోరాడుతుందని, భూభారతి ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం రైతాంగాన్ని మోసం చేయడమేనని, భూభారతి చట్టంలో అనేక లోసుగులు లోపాలు ఉన్నాయని వాటిని సరిచేసి ఫారెస్టు, రెవెన్యూ మిగులు భూములు, ఫారం పోగు, బంజరు భూములకు సాగులో ఉన్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుబంధు రైతు బీమా లను పకడిబందీగా అమలు చేసి రైతులను ఆదుకోవాలని. యాసంగి వడ్లు నేటికీ కల్లాల్లోనూ రోడ్లమీదనే ఉన్నాయని ఒక వైపున వర్షాలు వచ్చి రైతులు ఇబ్బంది పడుతున్న వడ్ల కొనుగోలులో నిర్లక్ష్యం జరుగుతుందని. పండిన పంటను మొత్తాన్ని తక్షణము కొనుగోలు చేసి రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు .సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రాములు మాట్లాడుతూ జిల్లాలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి సాగునీరు అందించాలని ఉదండాపూర్ ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు తక్షణమే ప్రత్యామ్నాయ గ్రామాలు నిర్మించి పునారావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.ఉదయం పార్టీ నిర్మాణం ప్రజాసంఘాల పని అనే రాజకీయ క్లాసును జిల్లా కార్యదర్శి ఏ రాములు బోధించారు .మధ్యాహ్నం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ సిపిఎం పార్టీ కార్యక్రమం అనే అంశాన్ని బోధించారు ఇందులో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్, ఆర్ రామ్ రెడ్డి, నల్లవెల్లి కురుమూర్తి, పద్మ, కె మోహన్, జగన్, చంద్రకాంత్, రాజ్ కుమార్, వేణుగోపాల్,మాణిక్యం రాజు,ప్రశాంత్, లక్ష్మయ్య, సత్యన్నా, హనుమంతు, కమరలి,భరత్, వరదగాలన్న తదితరులు పాల్గొన్నారు%---

# సి.జి.ఎఫ్ నిధులతో శివాలయ భూమి పూజ



టీ మీడియా, జూన్ 11, దేవరకద్ర :మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండల కేంద్రంలో ఎండోమెంట్ డిపార్ట్మెంట్ సిజిఎఫ్ నిధుల నుండి 40 లక్షల రూపాయలతో చేపట్టిన శివాలయం పునర్నిర్మాణం కు సంబంధించి నేడు దేవాలయం వద్ద చేపట్టిన పునర్నిర్మాణ పనుల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం స్వామివారిని దర్శించుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితదనంతరం రాచాల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రో" జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జియంఆర్. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరు చదువుకోవాలని లక్ష్యంతో బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని పేర్కొన్నారు, ప్రభుత్వ స్కూళ్లలో మెరుగైన సౌకర్యాలతో పాటు అర్హత, అనుభవం కలిగిన టీచర్లున్నారని, విద్యార్థులు చదువుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసిందని, ఇప్పటికే అన్ని స్కూళ్లకు యూనిఫాం లు, పాఠ్యపుస్తకాలను చేర్చిందని అన్నారు. అలాగే కౌకుంట్ల మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల వద్ద భూమి పూజ కార్యక్రమం చేశారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూములు ఇస్తామని మోసం చేసింది అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు దేవరకద్ర నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు అయ్యాయని, తర్వాత అదనంగా మరో 1000 ఇండ్లు మంజూరు చేస్తారు. నిజమైన లబ్ధిదారులకు ఈ ఇల్లు వస్తాయని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తామని మొదటి విడతలు ఇండ్లు మంజూరైన వారు తొందరగా కట్టుకోవాలని, దశలవారీగా బిల్లులు ఇస్తామని దీనికి ఉచిత ఇసుక కూడా ఇస్తామని ఆయన అన్నారు. డబ్బులు లేని బీదవారికి మహిళా సంఘాల నుండి ఒక లక్ష రుణం ఇప్పిస్తామని, ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

# దేవస్థానం ఘాట్ రోడ్ భూమి పూజ



టీ మీడియా ,జూన్ 11 చిన్న చింతకుంట :మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలంలోని పేదల తిరుపతి శ్రీ.శ్రీ.శ్రీ. కురుమూర్తి దేవస్థానం వద్ద ఎలివేటెడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ నిర్మాణ పనులు ప్రారంభమవుతున్న సందర్భంగా నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డిఅనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులకు, కురుమూర్తి స్వామి భక్తుల సౌకర్యార్థం ముఖ్యమంత్రి ఇచ్చిన మాట మేరకు ఎలివేటెడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ నిర్మాణానికి 110 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడంతో, నేడు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు, అదేవిధంగా దేవాలయం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ( కాటేజెస్, కళ్యాణమండపం) తదితర 60 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డి , టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి , దేవాలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి , దేవరకద్ర మార్కెట్ యార్డ్ చైర్మన్ కథలప్ప , టీపీసీసీ నాయకులు దొమ్మటి సాంబయ్య , భాస్కర్ యాదవ్, కురుమూర్తి దేవస్థానం పాలకమండలి సభ్యులు, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ఏరువాక పున్నమి సంబరాలు



టీ మీడియా ,జూన్ 11, కౌకుంట్ల:మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండలంలో ఆనవాయితీగా వస్తున్న ఏరువాక సంబరాలు ఘనంగా జరిగాయి. ఏరువాక పున్నమి సందర్భంగా ఎద్దులను రంగురంగులతో అలంకరించి గ్రామంలో ఉన్న అన్ని ఎడ్ల పండ్లు ఒక బండి వెనక బండ్లు సవారి చేస్తూ గ్రామము మధ్యలో గల ఏరువాకతాడును తెంపుతారు. ఎవరైతే ఏరువాకతాడును తెంపుతారో వారికి మొదటి బహుమతి ఇస్తారు. కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు అన్నారు.

# నా పోరాటం ఇక్కడితో ఆగదు..

## -ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర పోస్ట్


Komatireddy Raj Gopal Reddy @rajgo... · 1h

తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను.

నాకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే కారణంగా నేనే తిరిగి కాంగ్రెస్ పార్టీకి వచ్చాను.

ఈరోజు నేను మంత్రిగా లేకపోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతాను. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో నేను ఎప్పటికీ ముందుంటాను.

నా రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదు. కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పనిచేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుంది. అదే మార్గాన్ని నేను ఎంచుకున్నాను.

8 27 112 2.4K



టీ మీడియా, జూన్ 11, హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని కీలకమైన నేతల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ కూడా ఉన్నారు. వీరిలో ఇప్పటికే ఒకరు మంత్రి వర్గంలో ఉండగా మరొకరు ఎమ్మెల్యేగా ఉన్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ఈయన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ఉన్న పలుకుబడి, ప్రజాదరణతో ఎంపీ ఎన్నికల్లో పార్టీ ఇచ్చిన బాధ్యతలను విజయవంతం చేసిన ఆయన మంత్రి పదవిపై అనేక ఆశలు పెట్టుకున్నారు. కానీ సామాజిక సమీకరణల నేపథ్యంలో ఇటీవల జరిగిన కేబినెట్ విస్తరణలో ఆయనకు చోటు దక్కకపోవడంతో రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. దీంతో పార్టీ పెద్దలు ఆయన ఇంటికి వెళ్లి బుజ్జగించారు.అయితే, సామాజిక సమీకరణల నేపథ్యంలో కేబినెట్‌లో చోటును కోల్పోయిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇవాళ ఎక్స్ వేదికగా ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన వారికి ఎమ్మెల్యే రాజ గోపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం చేకూరాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. తనకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదని.. ప్రజల పట్ల తన నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల తన కలలే తనకు ప్రేరణగా నిలిచాయని అన్నారు. అదే కారణంగా తాను తిరిగి కాంగ్రెస్ పార్టీకి వచ్చానని రాసుకొచ్చారఈరోజు తాను మంత్రిగా లేకపోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతానని తెలిపారు. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో తాను ఎప్పటికీ ముందుంటానని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. తన రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదని%
%
కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పనిచేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుందని.. తాను కూడా అదే మార్గాన్ని ఎంచుకున్నాని రాజగోపాల్ రెడ్డి తాను చేసిన పోస్ట్‌లో రాసుకొచ్చారు.